



సిద్దిపేట కోమటి చెరువు కట్టపై పట్టణవాసుల సందడి



# న్యూఇయర్ వేళ ..

- సిద్దిపేట కోమటి చెరువు కట్టపై పట్టణవాసుల సందడి

సిద్దిపేట కమాన్, జనవరి 1: నూతన సంవత్సరం వేడుకల్లో భాగంగా సిద్దిపేట కోమటి చెరువు సోమవారం సందడిగా మారింది. చిన్నారులు, పెద్దలు, యువతులు, కుటుంబాలతో సహా సాయంత్రం పెద్ద ఎత్తున కోమటి చెరువుకు చేరుకున్నారు. అక్కడ సస్పెన్షన్ బ్రిడ్జి, వివిధ రంగుల్లో విద్యుత్ దీపాలు, బోటింగ్, డైనోసార్ పార్కు తదితర వాటిని సందర్శిస్తూ ఎంజాయ్ చేశారు. కోమటి చెరువు కట్ట ఎటు చూసినా ప్రజలతో కిక్కిరిసిపోయింది. కొత్త సంవత్సరంలోకి అడుగు పెట్టామని, ఎల్లప్పుడూ ఆనందంగా ఉండాలని కుటుంబ సభ్యులతో కలిసి వచ్చినట్లు పలువురు తెలిపారు.




# రూ.37.27 కోట్లు తాగేశారు!

## న్యూ ఇయర్ వేడుకల్లో ఫుల్ కిక్కు

సంగారెడ్డి/ మెదక్ (నమస్తే తెలంగాణ), జనవరి 1: ఉమ్మడి మెదక్ జిల్లాలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని అన్ని వర్గాల ప్రజలు ఆదివారం రాత్రి 12 గంటలకు 2023కు వీడ్కోలు పలికి 2024 కొత్త సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. న్యూ ఇయర్ పార్టీల్లో మద్యం పొంగిపొర్లింది. దీంతో ఉమ్మడి మెదక్ జిల్లాలో మద్యం అమ్మకాలు తారా స్థాయిని తాకాయి. డిసెంబర్ 30, 31వ తేదీల్లో ఉమ్మడి మెదక్ జిల్లాలో రూ.37.27 కోట్ల మద్యం విక్రయించారు. దీంతో ఎక్సైజ్ శాఖకు పెద్దఎత్తున ఆదాయం సమకూరింది. డిసెంబర్ 31వ రోజు అర్ధరాత్రి వరకు మద్యం విక్రయించేందుకు అనుమతి లభించడంతో మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి.

### మొత్తం 243 మద్యం దుకాణాలు

ఉమ్మడి మెదక్ జిల్లాలో మొత్తం 243 మద్యం దుకాణాలు ఉన్నాయి. సంగారెడ్డి జిల్లాలో 101, సిద్దిపేటలో 93, మెదక్ జిల్లాలో 49 దుకాణాలున్నాయి. 70కి పైగా బార్లు ఉన్నాయి. వీటిల్లో సాధారణ రోజుల్లో అమ్మకాలు రూ.5 నుంచి రూ.10 కోట్ల వరకు ఉంటాయి. న్యూఇయర్ వేడుకల సందర్భంగా శని, ఆదివారాల్లో ఉమ్మడి మెదక్ జిల్లాలో 37.27 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాలో 49,902 కేసులు లిక్కర్ అమ్మింది. సిద్దిపేట జిల్లాలో 11310 కేసులు, సంగారెడ్డి జిల్లాలో 18,197 కేసులు, మెదక్ జిల్లాలో 7266 కేసుల మద్యం విక్రయించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో రెండు రోజుల్లో 1,02,575 కేసుల బీర్లు అమ్ముడుపోయాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో 2022లో చివరి రెండు రోజులు రూ.28 కోట్ల విలువ చేసే మద్యం అమ్మకాలు జరుగగా, 2023 డిసెంబరు ఆఖరి రెండు రోజుల్లో రూ.37.27 కోట్ల విలువైన మద్యం కొనుగోలు చేశారు. దీంతో ఎక్సైజ్ శాఖకు పెద్ద మొత్తంలో ఆదాయం సమకూరింది.

### డిసెంబర్‌లో రూ.376 కోట్ల మద్యం అమ్మకాలు

ఉమ్మడి మెదక్ జిల్లాలో డిసెంబర్‌లో రికార్డు స్థాయిలో మద్యం అమ్మకాలు జరిగాయి. 2023 డిసెంబర్ మొత్తంలో ఉమ్మడి మెదక్ జిల్లాలో రూ.376.65 కోట్ల మద్యం విక్రయించారు. 2022లో రూ.300.51 కోట్లు. 2023 డిసెంబర్‌లో సంగారెడ్డి జిల్లాలో 1,92,947 కేసుల లిక్కర్, 1,89,638 బీర్ కేసులు అమ్ముడుపోయాయి. వీటి విలువ రూ.180.27 కోట్లు. సిద్దిపేట జిల్లాలో 1,29,301 కేసుల లిక్కర్, 1,66,553 బీర్ కేసుల కొనుగోలు జరిగింది. వీటి విలువ రూ.131.13 కోట్లు. మెదక్ జిల్లాలో 69.6 కేసుల లిక్కర్, 77,786 కేసుల బీర్‌లను మద్యంప్రియులు కొనుగోలు చేశారు. దీంతో మెదక్ జిల్లాలో రూ.64.97 కోట్ల మద్యం అమ్మారు. మొత్తంగా డిసెంబర్‌లో ఉమ్మడి మెదక్ జిల్లాలో మద్యం ప్రియులు రూ.376.65 కోట్ల ఆదాయాన్ని ఎక్సైజ్ శాఖకు సమకూర్చారు.



ఆదివారం రాత్రి సంగారెడ్డి పట్టణంలో మద్యం కొనుగోలు చేస్తున్న జనం



రాజగోపురం వద్ద భక్తుల సందడి



పూజలందుకుంటున్న అమ్మవారు

భక్తజనసంద్రంగా మారిన ఏడుపాయల

# కిక్కిరిసిన వనదుర్గామాత ఆలయం

పాపన్నపేట, జనవరి 1: ఏడుపాయల వనదుర్గా భవానీ మాత ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. 2023 సంవత్సరానికి ముగింపు పలుకుతూ 2024లోకి అడుగిడిన సందర్భంగా జిల్లాతో పాటు పొరుగు జిల్లాలు, రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఏడుపాయలకు చేరుకుని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. కొత్త సంవత్సరంలో అన్ని శుభాలే కలగాలని అమ్మవారిని మొక్కుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఏడుపాయల చైర్మన్ బాలాగౌడ్, ఈవో మోహన్‌రెడ్డితో పాటు పాలకమండలి సభ్యులు ఆలయ సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పాపన్నపేట ఎస్సై మహిపాల్ రెడ్డి తగిన బందోబస్తు చర్యలు చేపట్టారు.



ఏడుపాయల వనదుర్గామాత అమ్మవారి దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు


## మెదక్ చర్చిలో నూతన ప్రార్థనలు

- పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు, పర్యాటకులు... దీవెనలు అందించిన పాస్టర్లు

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 1: మెదక్ చర్చి సోమవారం భక్తులతో కిటకిటలాడింది. నూతన సంవత్సరం సందర్భంగా వేలాదిగా తరలి వచ్చిన భక్తులు, పర్యాటకులతో చర్చి ప్రాంగణమంతా కిక్కిరిసి పోయింది. ప్రత్యేక ప్రార్థనల్లో భక్తులు పాల్గొన్నారు. అనంతరం చర్చి ప్రెసిబేటరీ ఇన్‌చార్జి రెవరెండ్ శాంతయ్య భక్తులనుద్దేశించి దేవుడి సందేశం వినిపించారు. ఆదివారం రాత్రి 12 గంటల తరువాత చర్చిలో చర్చి ప్రెసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్య నేతృత్వంలో నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్లు శ్రీనివాస్, డేవిడ్, జైపాల్, సువర్ణలు భక్తులను అశీర్వదించారు. ప్రార్థనల్లో చర్చి కమిటీ సభ్యులు గంట సంపత్, శాంసన్ సందీప్, గెలెన్ చిత్తరంజన్, సువన్ డగ్లస్, జాన్సన్, వికాస్, నోబుల్‌సన్, జాయ్‌ముర్రే, సుశీల్, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.



భక్తులను ఆశీర్వదిస్తున్న చర్చి ప్రెసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్య



మెదక్ చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు

విద్యుత్ దీపాలతో అలంకరించిన కొమురవెల్లి మల్లన్న ఆలయం



# 7న మల్లన్న కల్యాణం

## ఏర్పాట్లు చేస్తున్న కొమురవెల్లి మల్లన్న ఆలయ అధికారులు



చేర్యాల, జనవరి 1: భక్తుల కొంగుబంగారం కొమురవెల్లి మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవం ఈనెల 7వ తేదీన (ఆదివారం) అత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్నారు. ఈ కల్యాణోత్సవానికి రాష్ట్ర నలుమూలలతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరుకానున్నారు. దీంతో ఆలయవర్గాలు స్వామి కల్యాణ ఆహ్వాన పత్రికలను మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే, దాతలు, అధికారులు, భక్తులకు అందజేస్తున్నారు. ఈ మహోత్సవాన్ని కనులారా చూసి తరలించాలని ఆలయ వర్గాలు కోరుతున్నాయి.

**వరుడు:** మల్లికార్జున స్వామి
**వధువులు:** మేడలాదేవి, కేతమ్మ దేవీ
**సుముహూర్తం:** స్వస్తిశ్రీ శోభకృత్ నామ సంవత్సరం, మార్గశిర మాసం, ఏకాదశి (07.01.2024 ఆదివారం), ఉదయం: 10-45 గంటలకు..
**కల్యాణ వేదిక:** కొమురవెల్లి పుణ్యక్షేత్రంలోని ఇంద్రకీలాద్రి ఆలయ ప్రాంగణంలో ఉన్న తోటబావి
**కన్యాదాతలు:** మహాదేవుని వంశస్తులు
**స్వీకర్తలు:** పడిగన్నగారి వంశస్తులు
**వేద పర్యవేక్షణ:** 1008 వీరశైవ పీఠాధిపతి మణికంఠ శివాచార్యుల ఆధ్వర్యంలో
**పురోహితులు:** నడిపుడి మఠం భవానయ్య స్వామి, భువనేశ్వరస్వామి, ఆనందయ్య, జ్ఞానేశ్వర్‌శాస్త్రి, చంద్రశేఖర్‌స్వామి, భద్రయ్యస్వామి,
**వ్యాఖ్యాతలు:** డాక్టర్ మహంతయ్య, నందుల మఠం శశిభూషణ సిద్ధాంతి స్వామిజీ
**ముఖ్య అతిథులు:** స్వామి వారి భక్తులు
**ఆహ్వానితులు:** ఆలయ కార్యనిర్వాహణాధికారి, వీరశైవ అర్చక, ఒగ్గు పూజారుల బృందం, ఆలయ సిబ్బంది.

### రెండు రోజుల పాటు పెండ్లి వేడుకలు

స్వామి వారి కల్యాణోత్సవ వేడుకలను ఆలయవర్గాలు రెండు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నారు. ఈ నెల 7న ఉదయం 5గంటలకు స్వామి వారికి దృష్టికుంభం (బలిహరణం), 10-45గంటలకు స్వామికల్యాణం, అనంతరం ఏకాదశ రుద్రాభిషేకం, రాత్రి 7గంటలకు రథోత్సవం (బండ్లు తిరుగుట). 8వ తేదీ సోమవారం ఉదయం 9గంటలకు స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం, లక్షబిల్వార్చన, అనంతరం మహామంగళహారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాదాల వితరణ, మహా మంగళహారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

## భక్తజన సంద్రంగా మల్లన్న క్షేత్రం

- 20వేల మందికి పైగా దర్శించుకున్న భక్తులు
- ప్రత్యేక పూజలతో మొక్కుల చెల్లింపు

చేర్యాల, జనవరి 1: ప్రముఖ పుణ్యక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జున స్వామి క్షేత్రం సోమవారం భక్తజన సంద్రంగా మారిపోయింది. స్వామిని దర్శించుకునేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి సుమారు 20వేల మందికి పైగా భక్తులు కొమురవెల్లికి తరలివచ్చినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. కొత్త సంవత్సరం మొదటి రోజు కావడంతో చేర్యాల, సిద్దిపేట, హుస్నాబాద్, గజ్వేల్, జనగామ, బచ్చన్నపేట, కరీంనగర్ తదితరల ప్రాంతాల నుంచి భక్తులు భారీగా వచ్చారు. ఏటా మొక్కులు చెల్లించుకునే భక్తులు శనివారం ఉదయం నుంచే మల్లన్న క్షేత్రానికి చేరుకున్నారు. అనంతరం ఆలయ నిర్వహణలో ఉన్న గదులతోపాటు ప్రైవేటు గదులు అద్దెకు తీసుకుని బస చేశారు. ఆదివారం కోనేరులో స్నానం చేసి, స్వామి దర్శనానికి క్యూలో గంటల పాటు వేచి దర్శించుకున్నారు. భక్తులు అర్చన, ప్రత్యేక పూజలు, కేశఖండన, నజరు, మహామండప, చిలుక పట్నం, బోనం, టెంకాయలు, హుండీలో కానుకలు వేసి మొక్కులు సమర్పించుకున్నారు. మరికొందరు తమ మొక్కులు తీర్చాలని గంగరేగు చెట్టు వద్ద ముడుపులు, సంతానం కలగాలని ఒల్లు బండ పూజలు, రాతిగీరల వద్ద మొక్కులు, కోడెను కట్టివేసి స్వామి వారిని వేడుకున్నారు. ఏఈవో వైరాగ్యం అంజయ్య, సూపరింటెండెంట్ నీలశేఖర్, ఆలయ సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులు సేవలు అందించారు.

రాజగోపురం ముందు భక్తుల సందడి

